సూర్య
www.suryaa.com
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
ఆదివారం,17 నవంబర్ 2024



# పోర్టుఫోలియో న్యాయమూర్తిని కలిసిన న్యాయవాదులు



**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పోర్టుఫోలియో జడ్జి జస్టిస్ నయనాల జయసూర్యని శనివారం స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కలిశారు. ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారి దర్శనార్థం వెళుతున్న హైకోర్టు న్యాయమూర్తిని రామచంద్రపురం బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పిల్లి మురళీమోహన్ వెంకటరమణ, సాయి ప్రసాద్ వాడ్రేవు ల ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. ఇటీవల రామచంద్ర పురానికి అదనపు జిల్లా కోర్టు మంజూరు అయిన సంగతి విదితమే, ఈ కోర్టు ప్రారంభోత్సవ తేదీ కోసం ఆయన్ని సంప్రదించారు. త్వరలోనే ప్రారంభ తేదీని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తెలియచేస్తుందని న్యాయమూర్తి చెప్పారు. తొలుత ఆయనకు స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు, జడ్జిలు. నిజామ్ శారద, వి.నాగేశ్వరరావు నాయక్ లు స్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు డి.ఎస్.ఎస్. శర్మ, పలివెల సత్యనారాయణ, సహా కార్యదర్శి వీరెడ్డి, జూనియర్ న్యాయవాదుల ప్రతినిధి పిల్ల పృథ్వి, న్యాయవాదులు డిపి శాస్త్రి, బుద్ధవరపు సూర్యనారాయణ, హైకోర్టు న్యాయవాది కె.అప్పారావు, స్థానిక సీనియర్ న్యాయవాదులు పి.సంపత్ రావు, వాకలపూడి జయశంకర్, బులుసు వెంకటేశ్వరరావు గాలింకి చిట్టిబాబు, దొమ్మల పాటి సత్యనారాయణ, వనితాశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# ఆరు గ్రామాల ఎన్నికలు నిర్వహించండి

**- కార్పొరేషన్లో విలీనం అయినా చేయండి**
**- అసెంబ్లీలో కాకినాడ రూరల్ పంచాయతీలపై ఎమ్మెల్యే నానాజీ ప్రస్తావన**

**కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ :** దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆరు గ్రామాల పంచాయతీల సమస్యపై ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) అసెంబ్లీలో తమ వాణి వినిపించారు. మొట్టమొదటిసారిగా అసెంబ్లీలో అడుగుపెట్టిన ఆయన మొట్టమొదటి గళం పంచాయతీలపై హుందాగా లేవనెత్తారు. రాష్ట్ర శాసనసభలో బడ్జెట్‌పై శనివారం జరిగిన ప్రశ్నోత్తర సమయంలో కాకినాడ రూరల్ మండలంలోని ఆరు గ్రామపంచాయతీలకు గత 13 సంవత్సరాలుగా ఎన్నికలు నిర్వహించని విషయాన్ని ప్రస్తావించిడం తో ఎమ్మెల్యే పంతం నానాజీకి ఆరు గ్రామాల ప్రజలు అభినందనలు తెలిపారు. గతంలో రమణయ్యపేట, వాకలపూడి, వలసపాకల, ఇంద్రపాలెం, తూరంగి, చీడిగ గ్రామ పంచాయతీలను కాకినాడ నగరపాలక సంస్థలో విలీనం చేయడానికి ప్రతిపాదించగా అప్పటి పాలకవర్గాలు వ్యతిరేకిస్తూ తీర్మానించాయని అన్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఆయా పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించకుండా ప్రత్యేక అధికారులను నియమించి వారి ద్వారా విలీనానికి అనుకూలంగా తీర్మానాలు తీసుకొని విలీనం చేస్తూ జీవో (నెంబర్ 175 తేదీ 2013 మార్చి 25వ తేదీ రోజున) జారీ చేసిందన్నారు. దీనిపై కొందరు గ్రామస్తులు హైకోర్టును ఆశ్రయించగా



(డబ్ల్యూ.పి. నెంబర్ 37445 ఆఫ్ 2015) జీవోను నిలుపుదల చేస్తూ ఆదేశాలు జారీ చేసిందన్నారు. పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించి ఆయా ప్రజా ప్రతినిధులు చేసిన తీర్మానాల ననుసరించి నగరపాలక సంస్థలో విలీనం చేయాలా లేదా అనేది నిర్ణయించాలని హైకోర్టు స్పష్టంగా పేర్కొందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రత్యేక అధికారులుగా చేసిన తీర్మానాలు చెల్లుబాటు కాదని హైకోర్టు తీర్పులో స్పష్టంగా పేర్కొందని అన్నారు. హైకోర్టు తీర్పు ప్రకారం ఆయా పంచాయతీలను నగరపాలక సంస్థలోవిలీనం చేసే అవకాశం లేనందున ఆయా పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రభుత్వానికి లేఖ రాశారని తెలిపారు. ఎన్నికలు జరపకపోవడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం ఏమీ లేదని న్యాయస్థానాలలో వ్యాజ్యం మాత్రమే కారణమని అన్నారు. సకాలంలో ఎన్నికలు జరపకపోవడంతో ప్రతి సంవత్సరం సుమారు 5 కోట్ల రూపాయలు ఆర్థిక సంఘం నిధులు ఆయా పంచాయతీలకు జమ కావడం లేదని అన్నారు.

ఇంటి పన్నులు మాత్రమే ఆ పంచాయతీలకు ఆదాయ వనరుగా ఉందని, దీంతో పారిశుధ్య కార్మికులకు జీతాలు కూడా చెల్లించలేని స్థితి నెలకొందని అన్నారు. గత ప్రభుత్వం పంచాయతీలకు స్టాంప్ డ్యూటీ నిధులు విడుదల చేయలేదని కానీ మన ప్రభుత్వం వచ్చిన తర్వాత నిధులు విడుదలవుతున్నాయని అన్నారు. ఈ ఆరు పంచాయతీలకు మాత్రం స్టాంపు డ్యూటీ నిధులు విడుదల కావడం లేదని అన్నారు. కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ వసూలు చేసే బిల్డింగ్ ప్లాన్‌లో ఈ ఆరు పంచాయతీలకు విడుదల చేయాల్సిన వాటా ను జమ చేయడం లేదని అన్నారు.

ఈ ఆరు గ్రామపం చాయతీలకు ఎన్నికలు నిర్వహించండి లేదా నగరపాలక సంస్థలో విలీనం చేయాలని కోరారు. అదేవిధంగా న్యాయస్థానాలలో వ్యాజ్యం కారణంగా ఆయా పంచాయతీలకు ఎన్నికలు జరగలేదనే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కావడానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నానాజీ శాసనసభలో ప్రస్తావించడం నియోజకవర్గ ప్రజలు ప్రసార మాధ్యమాల్లో ఆసక్తిగా తిలకించారు.

## రామ్మూర్తి నాయుడు సేవలు సదా స్మరణీయం

**- సీఎం చంద్రబాబు సోదరుడు మృతికి మంత్రి సుభాష్ సంతాపం**



**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోదరుడు, మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు మరణంపై రాష్ట్ర కార్మిక శాఖ మాత్యులు వాసంశెట్టి సుభాష్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన మృతి తెలుగుదేశం పార్టీకి, చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకు తీరని లోటుగా పేర్కొన్నారు. నారా రామ్మూర్తి నాయుడు 1994 నుంచి 1999 వరకు చంద్రగిరి శాసనసభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తూ విశేష సేవలు అందించారని మంత్రి సుభాష్ గుర్తు చేశారు. శాసనసభ్యుడిగా, మంచి మనసున్న మనిషిగా ప్రజలకు సేవ చేశారని, ఆయన విశిష్టమైన సేవలు, నిరాడంబరత మరవలేనివని మంత్రి సుభాష్ స్మరణకు తెచ్చుకున్నారు. నారా రామ్మూర్తి నాయుడు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, భగవంతుడు వారికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా ప్రార్థించినట్లు మంత్రి తెలిపారు. రామ్మూర్తి నాయుడి సేవలను తెలుగు ప్రజలు ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటారని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

## భోగిగణపతి పీఠంలో దీపాలంకరణ సేవ



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** స్వయం భూ కాకినాడ భోగిగణపతి పీఠంలో శ్రీవారి 59వ జపయజ్ఞ పారాయణ సందర్భంగా శనివారం ఉదయం సుప్రభాతవేళలో దీపాలంకరణ సేవ జరిగింది. శివకేశవ సహస్రనామావళి పఠించారు. మనో వికాసానికి సజ్జనత్వానికి సద్గుణ సంపత్తికి పరబ్రహ్మ స్వరూపమైన కార్తీక దామోదర దీపమే వైకుంఠ నారాయణుని ఆనందధామం. దీపోత్సవంతో శ్రీవారి సంకీర్తననిర్వహించడం వలన లోకకళ్యాణానికి లక్ష్మీ సౌభాగ్యం వర్ధిల్లుతుంది. కార్తీక మాసంలో వచ్చే 3వ సోమవారం 18న గణాధిప సంకష్టహర చతుర్ధి సందర్భంగా ఉదయం 5.30 గంటలకు మంగళ వాయిద్యాలతో నగర సంకీర్తన, లక్షమారేడు దళాలతో మహాగణపతికి బిల్వార్చన, లక్ష వత్తులతో అఖండ హారతి, చతుర్థి ఉపవాసకులకు అల్పాహార సమారాధనతో 10వ చతుర్థి మాసోత్సవం జరుగుతుంది.

## ధాన్యం కొనుగోలు యాప్‌లపై అగ్రికల్చర్, డేటా ఎంట్రీ, టెక్నికల్ సిబ్బందికి శిక్షణ



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** ఖరీఫ్ సీజన్‌కి చెంది మండలంలోని ధాన్యం కొనుగోలు చేయుటకు సంబంధిత యాప్ లపై అగ్రికల్చర్ సిబ్బంది, డేటా ఎంట్రీ ఆపరేటర్, టెక్నికల్ అసిస్టెంట్లకు రంపచోడవరంలో శిక్షణ ఇచ్చినట్లు మండల వ్యవసాయ అధికారి తెలిపారు. మండలంలో ఆరు కొనుగోలు కేంద్రాలు త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణ నిమిత్తం రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో యాప్‌ల పైన, శాంపిల్ అనాలసిస్ నిమిత్తం శిక్షణఇవ్వడం జరిగిందన్నారు.

ఖరీఫ్ సీజన్ 2024-25 నకు సాధారణ రకం ధాన్యం క్వింటాల్‌కు 2300, గ్రేడ్ - రకం 2320గా ప్రభుత్వం ధర నిర్ణయించి నట్లు ఏవో వివరించారు. మండలంలోని రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రముల ద్వారా తమ పంటను విక్రయించాలని ఏ ఒక్క రైతు దళారులు, మధ్యవర్తులను ఆశ్రయించి నష్టపోవద్దన్నారు. శిక్షణ కార్యక్రమంలో సివిల్ సప్లైస్ ఏ ఎస్ ఓ భాస్కర్ , ఏవో, వి ఏ ఏ, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు వున్నారు.

## సారా బట్టిపై పోలీస్ దాడులు

**- 100 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం, ఇరువురి వ్యక్తుల అరెస్ట్**
**- ఎస్ఐ నరసింహ మూర్తి**



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** మండలంలోని రాజు పేట గ్రామ శివారు నిర్వహిస్తున్న సారా బట్టి పై దాడి నిర్వహించి 100 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి ఇరువు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్ ఐ నరసింహమూర్తి తెలిపారు. శనివారం ఉదయం వారికి వచ్చిన సమాచారం మేరకు సిబ్బంది సహాయంతో వెళ్లి రాజుపేట గ్రామశివారు రిజర్వ్ ఫారెస్ట్ ఏరియాలో రహస్యంగా నిర్వహిస్తున్న సారా బట్టీ పై దాడి చేసి సారా తయారు చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోనికి తీసుకొని వారి వద్దనుండి 10 లీటర్ల సారాసీజ్ చేసి 100 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేయడం జరిగింద న్నారు.ముద్దాయిలను అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం శనివారం జేఎఫ్ సీమ్ కోర్ట్ అడ్డతీగలకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. స్టేషన్ పరిధిలో ఎవరైనా సారా తయారు చేసినా విక్రయించినా , రవాణా చేసినా సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకో వడం జరుగుతుందని ఎస్ఐ నరసింహమూర్తి హెచ్చరించారు.

### ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించిన వృద్ధుడు



**కొవ్వూరు, మేజర్ న్యూస్ :** కొవ్వూరు గోష్పద క్షేత్రంలో గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించిన వృద్ధుడిని పట్టణ పోలీసులు రక్షించారు. ధవలేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజవోలు గ్రామానికి చెందిన 78 సంవత్సరాల వృద్ధుడు నిమ్మల పూడి సత్యనారాయణ ఆత్మహత్యకు యత్నించాడు. సమాచారం తెలుసుకున్న పట్టణ సీఐ పీ.విశ్వం సంఘస్థలానికి చేరుకుని ఆ వృద్ధుడిని పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి అప్పగించారు. ఈ వృద్ధుడిపై ధవలేశ్వరం పోలీస్ స్టేషన్‌లో అదృశ్యమైనట్లు కేసు నమోదు అయిందని తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం ధవలేశ్వరం సిఐకు సమాచారం అందజేసినట్లు సీఐ. పి.విశ్వం తెలిపారు.

### ఎస్సీల వర్గీకరణపై కమిషన్ వేసే అధికారం రాష్ట్రాలకు లేదు



**కొవ్వూరు, మేజర్ న్యూస్ :** యస్సి వర్గీకరణ క్రిమిలేయర్‌పై రాష్ట్రప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమిషన్ తక్షణమే విరమించాలని మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బొంతా శ్యామ్ రవిప్రకాష్ డిమాండ్ చేసారు. యస్సిల వర్గీకరణపై కమిషన్ వేసే అధికారం రాష్ట్రాలకు లేదని రాజ్యాంగ బద్దంగా ఆర్టికల్ 338ద్వారా నియమించబడిన జాతీయ రాష్ట్ర యస్సి కమిషన్ లు వున్నయని వాటిని కాదని వేరే కమిషన్ నియమించడం రాజ్యాంగ విరోధమే అవుతుందని పేర్కొన్నారు.

విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజాన్ మిశ్రా కమిషన్ ను రాష్ట్ర వ్యాప్తంగా మాలలు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. క్రిమిలేయర్ ముసుగులో షెడ్యూల్ కులాలు తెగల రిజర్వేషన్ తొలగించడం కొరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నం చేస్తున్నాయని పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు కులల మధ్య కుంపటి పెట్టడం మాని స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకుండా అడ్డుకోవాలని కోరారు.

# మండల సమస్యలు మంత్రుల దృష్టికి

**- స్పందించిన మంత్రులు**



**ఎటపాక,మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ మంత్రులను శనివారం అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలానికి చెందిన తెలుగు యువత నాయకులు కలిసి ముంపు మండల సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా తెలుగు యువత నాయకులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సచివాల యంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల వీరాంజనేయ స్వామిని కలిసి ఏజెన్సీలో గిరిజనులకు మాత్రమే గృహాలు కేటాయిస్తున్నారని, అలాగే గిరిజ నేతరులకు కూడా గృహాలు కేటాయించాలని ఆయన కోరడం జరిగింది అని, ఆయన వెంటనే స్పందించి తగు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ని కలిసి ఎటపాక గ్రామంలో త్రీఫేస్ లైన్ కావాలని కోరగా వెంటనే స్పందించి పాడేరు ఎస్ఈతో మాట్లాడి సమస్యను త్వరగా పరిష్కరించాలని ఆదేశించినారని, జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కలిసి పోలవరం నిర్వహిస్తున్న సమస్యల గురించి వివరించి పొలాల ప్యాకేజీ మరియు ఆర్అండ్ఆర్ ప్యాకేజ్ ఇప్పించాలని అలాగే ఎటపాక నుండి కన్నాయిగూడెం వరకు ఐదు కిలోమీటర్ల పరిధిలో కరకట్ట మంజూరు చేయాలని కోరడం జరిగింది అని, ఆయన వెంటనే స్పందించి న్యాయం చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది అని వారు తెలిపారు. మండల సమస్యలను పరిష్కారిస్తామని హామీ ఇచ్చిన మంత్రులకు ప్రత్యేక ధన్యవాదములు తెలుపుతున్నామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు నలజాల శ్రీకాంత్, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి గడేసుల రంజిత్ కుమార్, ఎటపాక మండల తెలుగు యువత ఉపాధ్యక్షుడు పాటి సంపత్ కుమార్, ఎటపాక మండల ఐటీడీపీ చాంపియన్ బాచినేని శ్రీకాంత్ పాల్గొన్నారు.

# గృహ లబ్దిదారులతో సంఘాలు ఏర్పాటు చెయ్యండి

**- లబ్దిదారులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలి**
**- ఆదివారం ఒకరోజు లబ్దిదారులు అర్జీలు పరిష్కారం కోసం అందుబాటులో ఉండాలి - కలెక్టర్ పి.ప్రశాంతి**



**రాజానగరం, మేజర్ న్యూస్ :** పేదలందరికీ ఇళ్ల నిర్మాణం పూర్తి చేసేలా డిసెంబరు నెల చివరి నాటికి 2333 ఇళ్ల నిర్మాణ లక్ష్యం కాగా ఇప్పటి వరకూ 306 (13 శాతం) పూర్తి చెయ్యడం జరిగిందని , మిగిలిన లక్ష్యాలు సాధించడానికి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి పేర్కొన్నారు. శనివారం వెలుగుబంద హౌసింగ్ కాలనీ లో అధికారులతో కలిసి కలెక్టర్ పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ, జిల్లాలో పేద కుటుంబాల ఇళ్ళ నిర్మాణాలు వేగవంతం చేసేందుకు నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించడంలో సమన్వయంతో పనిచేయాలన్నారు. ఆప్షన్ 3వ కింద 3396 ఇళ్ళ నిర్మాణం చేపట్టాల్సి ఉండగా 683 పూర్తి కాగా మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. పునాదుల స్థాయిలో 56 , బేస్ మెంటు పూర్తి చేసినవి 125 , మిగినవి వివిధ దశల్లో ఉన్నట్లు తెలిపారు. వారం వారం లక్ష్యాలను నిర్ణయించుకుని వాటినీ సాధించాల్సి ఉందన్నారు. గ్రూపులుగా లబ్ధిదారులను ఎంపిక చేసి వారి సమస్యలు తెలుసుకుని అనంతరం పరిష్కార మార్గాలను చూపాలన్నారు. లబ్ధిదారులతో కూడిన వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చెయ్యాలని ఆదేశించారు. లబ్ధిదారులకు నాయకత్వ లక్షణాలు కల్పించడం లబ్ధిదారులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి సమిష్టి బాధ్యతతో సమస్య పరిష్కారానికి అవకాశం ఉంటుందన్నారు.

బిల్లుల చెల్లింపు కోసం జియో ట్యాగింగు సమస్య ఉందని, వారికి సరైన విధానంలో మార్గదర్శకం చేయాలన్నారు. లబ్దిదారులు చిన్న జీవనోపాధి వృత్తులలో ఉండడం జరుగుతుందని, ఆదివారం ఒకరోజు లబ్దిదారులు అర్జీలు పరిష్కారం కోసం అందుబాటులో ఉండాలనీ కలక్టర్ ప్రశాంతి కోరడం జరిగింది. పట్టణ ప్రాంతాల్లో లబ్దిదారులు ఉండడం వల్ల మునిసిపల్ కార్పొరేషన్ సిబ్బంది సహకారం అందించాలని ఇన్చార్జి హౌసింగ్ పిడి కె ఎల్ శివ జ్యోతి విజ్ఞప్తి చెయ్యగా, బిల్లులు చెల్లింపు తదితర అంశాలు గ్రామీణ ప్రాంతాలకు చెందిన దృష్ట్యా సమన్వయ బాధ్యతలు చేపట్టలన్నారు. కలెక్టర్ వెంట ఇన్చార్జి హౌసింగ్ పిడి కె ఎల్ శివ జ్యోతి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ బీవీ గిరి, ఇతర జిల్లా, డివిజన్ మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## నవంబర్ 26 కలెక్టరేట్ ధర్నాని జయప్రదం కోరుతూ కరపత్రం ఆవిష్కరణ

**- రైతులు, కార్మికుల కోర్కెలు కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలను వ్యతిరేకిస్తూ 13 కేంద్ర కార్మిక సంఘాలు, 500 రైతు సంఘాలు సంయుక్తంగా జిల్లా కేంద్రాలలో నవంబరు 26 దేశవ్యాప్త ధర్నా చేయాలని ఇచ్చిన పిలుపులో భాగంగా కాకినాడ కలెక్టరేట్ వద్ద పెద్ద సంఖ్యలో రైతులు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ముందు దేశవ్యాప్తంగా కార్మికులు రైతులు పదేళ్ల క్రితం పెట్టిన 15 డిమాండ్లలో ఏ ఒక్క కోర్కెను మోడీ ప్రభుత్వ నెరవేర్చలేదని విమర్శించారు. మధ్య తరగతి ప్రజలు పన్నులు చెల్లించలేక పేదరికంలోకి జారుకుంటున్నట్లు నివేదికలు తెలియజేస్తున్నాయని, రైతులు కార్మికులు మరింత పేదరికంలోకి నెట్టబడడానికి మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలే కారణమని తెలియజేశారు. ఇదే సందర్భంలో కార్పొరేట్లకు 12 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసి ప్రపంచ కుబేరుల స్థానంలో అదానీ, అంబానీలు ఎదగడానికి మోడీ ప్రభుత్వం నిస్సిగ్గుగా సహాయపడుతుందన్నారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని, ఏ రంగంలో పనిచేసే కార్మికుడికైనా ధరలకు అనుగుణంగా కనీస వేతనం 26 వేలు చెల్లించాలని, పరిశ్రమలలో కార్మికుల జీవితాలకు భద్రత కల్పించేలా సేఫ్టీ సౌకర్యాలు కల్పించాలని, నిత్యవసర సరుకుల ధరలు తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధిని కేటాయించాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేసి కార్మికులను బానిసత్వం నుండి విడుదల చేయాలని, కౌలు రైతులకు భూ యజమానితో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పంట రుణాలు, నష్టపరిహారం చెల్లించాలని, ఉపాధి హామీ కార్మికులకు 200 రోజుల పని దినాలను కల్పించి రోజు వేతనం 600 చెల్లించాలని, విశాఖ ఉక్కు, రైల్వే, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలలో ఖాళీగా ఉన్న 18 లక్షల పోస్టులు నిరుద్యోగులతో తక్షణం భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 26 కాకినాడ కలక్టరేట్ వద్ద జరిగే కార్మిక కర్షక ఐక్య ధర్నాలో పెద్దసంఖ్యలో నిరుద్యోగులు, కార్మికులు, రైతులు, కౌలు రైతులు, ఉపాధి కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజకుమార్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు తాళ్లూరి రాజు, ఐఎఫ్టియు జిల్లా సహాయ కార్యదర్శి గుబ్బల ఆదినారాయణ, ఏఐసీసీటీయూ రాష్ట్ర కన్వీనర్ గొడుగు సత్యన్నారాయణ, మెడిశెట్టి వెంకట రమణ, టి.రాజా తదితరులు పాల్గొన్నారు.


## పాస్‌పోర్ట్ పడిపోయినది

తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ఖండవల్లి గ్రామానికి చెందిన మొల్లేటి చంద్రకళ W/o వెంకట సత్యనారాయణకు చెందిన పాస్‌పోర్ట్ ప్రయాణ సమయంలో ఎక్కడో పడిపోయినది. పాస్‌పోర్ట్ దొరికిన వారు క్రింది అడ్రస్‌కు అందజేయగలరు.

మొల్లేటి చంద్రకళ W/o వెంకట సత్యనారాయణ,
ఖండవల్లి. ఫోన్ నెంబరు : 7207441033

## గ్రంథాలయాలు సమాజ నిర్మాణ సోపానాలు



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** గ్రంథాలయాలు సహజ నిర్మాణ సోపానాలని గురుకుల పాఠశాల లైబ్రేరియన్ విజయ మేడం విద్యార్థులకు సూచించారు. తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయం సంస్థ ఆధ్వర్యంలో ఏలేశ్వరం శాఖా గ్రంథాలయం నందు 57వ,జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ప్రత్యేక శిక్షణ, అవగాహన కార్యక్రమాలు చేపట్టారు శనివారం విద్యార్థిని,విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమములో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల అధ్యాపకులు, అగ్లీలియం ఉపాధ్యాయులు సూర్యప్రకాష్, భాష్యం ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఎలిమెంటరీ విద్యార్థులు 40మంది పాల్గోన్నారు.

## 117 జీవో రద్దుపై హర్షం.. మెర్రమోతు ధర్మరాజు



**ధవళేశ్వరం, మేజర్ న్యూస్ :** 3,4,5 తరగతుల విద్యార్థులను ఉన్నత పాఠశాలలో విద్య నభ్యసించే దిశగా విలీనం చేస్తూ గత ప్రభుత్వం 117 ప్రభుత్వ ఉత్తర్వు అమలు ద్వారా ప్రాథమిక పాఠశాల లు నిర్వీర్యం అయ్యాయని తక్షణం సదరు ఉత్తర్వు రద్దు చేయాలని కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన పిదప ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖా మాత్యులు నారా లోకేష్ కు బాలికోన్నత పాఠశాల మాజీ సమన్వయ కర్త యర్రమోతు ధర్మరాజు లేఖ ద్వారా తెలియ పరిచారు, సదరు ఉత్తర్వు ద్వారా వేలాది ప్రాథమిక పాఠశాల లు మూత పడ్డాయని, విద్యార్థులు సమీప ప్రైవేటు పాఠశాలల్లో చేరడంతో ప్రాదమిక పాఠశాలలు మూతపడ్డాయి, సదరు ఉత్తర్వు రద్దు ద్వారా తిరిగి బలోపేతం అవుతాయని ధర్మరాజు ఆకాంక్షించారు, నా లేఖకు స్పందించి విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో ఉంచి గత ప్రభుత్వ ఉత్తర్వు రద్దు చేసినందుకు విద్యాశాఖ మాత్యులు లోకేష్ కు ధర్మరాజు దన్యవాదములు తెలియజేశారు.

# 'ఐటీడీఏ'లో మినీ అంగన్వాడీలు ఆందోళన



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** మినీ అంగన్వాడీ లు సమస్యలు పరిష్కరించాలని రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో ధర్నా నిర్వహించారు. సీఐటీయూ ఆద్వర్యంలో కారం రామలక్ష్మి అధ్యక్షతన మినీ అంగన్వాడీ సమస్యలు పరిష్కారం చెయ్యాలని సీఐటీయూ జిల్లా కార్యాలయం నుండి రంపచోడవరం ఐటీడీఏ వరకు నినాదాలు చేస్తూ ర్యాలీగా వెళ్లి ఐటీడీఏ వద్ద బైఠాయించి మినీ అంగన్వాడి సెంటర్లను మైన్ సెంటర్లుగా మారుస్తూ జీవో ఇవ్వాలని కోరుతూ సుమారు మూడు గంటల పైన ధర్నా చేపట్టారు. అయినప్పటికీ ఐటీడీఏ పీవో నిర్లక్ష్యం తో వ్యవహరించటం తో అంగనివాడీ లందరు సహనాన్ని కోల్పోయి ఐటీడీఏ లోపలికి చొచ్చుకునిపోయారు. వెళ్ళే క్రమం లో పోలీసులకు అంగన్వాడీలకు మధ్య వాగ్వాదం జరిగింది. ఐటీడీఏ పీవో నిర్లక్ష్య వైఖరి నశించాలని నినాదాలు చేశారు. అప్పుడు పీవో బైటకి వచ్చి సమస్యలతో కూడిన వినతిత్రాన్ని అందుకుని సానుకూలంగా స్పందించారు. సందర్భంగా అంగన్వాడి అండ్ హెల్పర్ల యూనియన్ రాష్ట్రఅధ్యక్షురాలు జీ.బేబీరాణి మాట్లాడుతూ రాష్ట్రంలో పేద గర్భిణీలు,బాలింతలు, చిన్న పిల్లలు కు మినీ అంగన్వాడీలు అనేక సేవలు అందిస్తున్నారని అన్నారు. అంగన్వాడీ సెంటర్ నిర్వహణకు వర్కర్ పని హెల్పర్ పని చెయ్యడం వలన పనిభారం ఎక్కువైందని అన్నారు.అధికారంలోకి వచ్చిన కూటమి చంద్రబాబు ప్రభుత్వం అంగనివాడీల సమస్యలు పరిష్కారం చేయకుండా ఎక్కువ పనిభారం మోపుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. గతంలో అంగనివాడీలను చంద్రబాబు అధికారంలో వున్నప్పుడు గుర్రాలతో తొక్కించి భయభ్రాంతులను గురిచేసి తొమ్మిది సంవత్సరాలు అధికారాన్ని కోల్పోవడం జరిగిందని చంద్రబాబుకి గుర్తుచేశారు. మినీ అంగన్వాడీ సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆమె డిమాండ్ చేశారు. మినీఅంగన్వాడీ వర్కర్లకు ప్రమోషన్ ఇవ్వాలని జీవో ఉన్న సక్రమంగా అమలు కావడం లేదని అన్నారు. అత్యవసర సందర్భంలో వేసవిలో గానీ మినీఅంగన్వాడీ వర్కర్లకు ఏటువంటి చెలవులు ఇవ్వడం లేదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణగా వేతనాలు పెరగలేదు, మినీఅంగన్వాడీ వర్కర్లకు మైన్ వర్కర్లకు మార్చాలని, ఇతర సమస్యలు పరిష్కారం చెయ్యాలని, 42 రోజులపాటు జరిగిన సమ్మె సందర్భంగా మినీఅంగన్వాడీ వర్కర్లకు మైన్ అంగన్వాడీ వర్కర్లుగా మారుస్తమన్న హామీని అమలు చెయ్యాలని డిమాండ్ చేశారు. మినీ వర్కర్లకు ఖాళీ పోస్టుల్లో ప్రమోషన్ లు ఇవ్వాలని, మినీ అంగన్వాడీ వర్కర్లకు మైన్ అంగన్వాడీ వర్కర్లుతో సమానంగా వేతనాలు ఇవ్వాలని, గ్రేడ్ 2 సూపర్ వైజర్ పోస్టులకు మినీఅంగన్వాడీ వర్కర్లకు అవకాశం కల్పించాలని, 42 రోజుల సమ్మె మినిట్స్ కాపీని అమలు చెయ్యాలని, సర్వీస్‌లో వుండి చనిపోయిన వర్కర్లకు మట్టి ఖర్చులు జీవోని వెంటనే అమలు చెయ్యాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కారం చెయ్యకుంటే ఈ ఆందోళన ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు మట్ల వాణిశ్రీ, జిల్లా ఉపాధ్యక్షులు పి.రామరాజు, కె.శాంతిరాజు, అంగన్వాడి యూనియన్ జిల్లా కార్యదర్శి బి.నిర్మల, జిల్లా నాయకులు, కె.రాణి, సింగరమ్మ, కె.వెంకటలక్ష్మి, జీ.బేబీరాణి తదితర అంగన్వాడిలు పాల్గొన్నారు.

## "పనిప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపుల నిషేధ చట్టం, 2013" పై న్యాయ విజ్ఞాన సదస్సు




**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** శనివారం సుప్రీం కోర్టు వారి ఆదేశానుసారం తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయస్థాన ఆవరణలోని డి ఎల్ ఎస్ ఎ కార్యాలయంలో "పనిప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపుల నిషేధ చట్టం, 2013" పై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జ్ శ్రీమతి. బి.పద్మ మాట్లాడుతూ పని ప్రదేశాలలో మహిళలకు భద్రత కల్పించేందుకు చేయబడిన "పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపుల నిషేధ చట్టం, 2013" లోని వివిధ అంశాలను గురించి వివరించారు. లైంగిక వేధింపులు, అసభ్యకర కార్యకలాపాలకు పాల్పడితే చట్ట పరమైన చర్యలు తప్పవని అన్నారు. ప్రతీ కార్యాలయంలో ఈ విషయాల పై చర్యలు తీసుకునేందుకు ఆ సంస్థకు సంబంధించిన అధికారులు, ఉద్యోగులు, తదితరులతో కూడిన "అంతర్గత ఫిర్యాదుల కమిటీ" ఉంటుందని తెలిపారు. పనిప్రదేశాలలో మహిళలకు ఎలాంటి లైంగిక వేధింపులు ఎదురైనా వెంటనే ఈ కమిటీ దృష్టికి తీసుకురావాలన్నారు. విచారణ జరిపిన తరువాత తగు రీతిలో చర్యలు కమిటీ తీసుకుంటుందని వివరించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ బాబు మాట్లాడుతూ సహ ఉద్యోగులతో సోదరభావంతో మెలగాలని, వారికి ఇబ్బందికర పరిస్థితులకు గురిచేయరాదని అన్నారు. పని ప్రదేశాలలో మహిళలతో మాత్రమే కాకుండా కార్యాలయాలకు వచ్చే వారితో కూడా గౌరవంగా వ్యవహరించాలని అన్నారు. ఈ సదస్సులో అసిస్టెంట్ కలెక్టర్ భావనా హెచ్.ఎస్ , ఐ.సి.డి.ఎస్. పి.డి. కె.విజయ్ కుమారిగ, రెవెన్యూ సిబ్బంది, సి.డి.పి.ఒ నర్సమ్మ , వార్డ్ సచివాలయం పాల్గొన్నారు.

## స్ఫటిక లింగ స్పర్శ దర్శనానికి పోటెత్తిన భక్తులు

**– స్వామివారిని దర్శించుకున్న మంత్రులు డాక్టర్ రామానాయుడు, వాసంశెట్టి సుభాష్**



**పెరవలి, మేజర్ న్యూస్ :** అన్నవరప్పాడు గ్రామం లోని 16 నెంబర్ జాతీయ రహదారి పక్కన విచ్చేసిఉన్న స్ఫటిక లింగ స్పర్శ దర్శనం అంగరంగ వైభవంగా జరుగుతుంది. నవంబర్ 16వ తేదీ శని వారం రాష్ట్ర కార్మిక శాఖ మాత్యులు వాసంశెట్టి సుభాష్, రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు లు స్వామి వారిని దర్శించుకున్నారు. భారీ సంఖ్యలో స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ నిర్మాణ కర్త బోలిశెట్టి రామకృష్ణ అన్నారు. ఇక్కడ స్ఫటిక లింగాన్ని తమ చేతులతో స్వయంగా స్పర్శ దర్శనం చేసుకొనేల ఏర్పాటు చేశాం అని తెలిపారు.సంవత్సరంలో మూడు పర్యాయాలు మాత్రమే స్వామి వారి దర్శనానికి అవకాశం ఉంటుందని మిగతా రోజుల్లో కోనేటి నీటితోనింపిఉంటుందని ఆలయ అర్చకులు ఫణి శర్మ తెలిపారు.

## పట్టభద్రుల ఓటుకు 3696 ధరఖాస్తులు

**– తహశీల్దార్ వెంకటలక్ష్మీ**



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** ఉభయ గోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో ఓటు కోసం ఇప్పటివరకు పెద్దాపురం మండల, పట్టణానికి సంబంధించి 3696 ధరఖాస్తులు వచ్చాయని, ఏఇఆర్వో ని హెచ్.వెంకటలక్ష్మీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె తెలుపుతూ ఈ నెల 6వ తేది వరకు వచ్చిన ధరఖాస్తులపై విచారణ దాదాపు పూర్తి చేయడం జరుగుతుందని, 23న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించడం జరుగుతుందని ఆమె తెలిపారు. అదే రోజు నుంచి డిశంబర్ 9 వరకు అర్హత ఉన్న పట్టభద్రులు మళ్ళీ ఓటుకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చునన్నారు. ధరఖాస్తుతో పాటు డిగ్రి ధృవపత్రం సమర్పించే క్రమంలో దానిపై గెజిటెడ్ అధికారుల సంతకం అవసరం లేదని, బూత్‌స్థాయి అధికారులు విచారణ నిమిత్తం ఇళ్ళకు వచ్చినపుడు ఒరిజినల్ డిగ్రీ ధృవపత్రం, గెజిటెడ్ ధృవీకరణ అయిన నకలు ధృవపత్రం చూపితే సరిపోతుందన్నారు. 10+2+3 విధానంలో పొందిన డిగ్రితో పాటు, 10+3 విధానంలో ఓపెన్ వర్శిటిలో డిగ్రి పొందినవారు అర్హులని తహశీల్దార్ తెలిపారు.

## పల్లె పండుగ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

**– ఇఇ మల్లిఖార్జున**



**పెద్దాపురంరూరల్,మేజర్‌న్యూస్:** పెద్దాపురం నియోజకవర్గంలో పల్లె పండుగ పనులను శనివారం పంచాయతీరాజ్ ఇఇ మల్లిఖార్జున పరిశీలించారు. మండలంలో వడ్లమూరు, గోరింట, చదలాడ, తిరుపతి గ్రామాలలో జరుగుతున్న పనులను ఇఇ పరిశీలించి, డిశంబర్ నెలాఖరుకి పూర్తి చేయాలి డిఇఇ, ఏఇఇ లను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన తెలుపుతూ పెద్దాపురం మండలంలో చదలాడలో రూ.90లక్షలతో, గోరింటలో రూ.90లక్షలతో, కాండ్రకోటలో రూ.30లక్షలతో, వడ్లమూరులో రూ.ఒక కోటితో, తిరుపతి రూ.ఒక కోటితో, ఆనూరులో రూ.25లక్షలతో, ఆర్.బి.పట్నంలో రూ.20లక్షలతో, జె.తిమ్మాపురంలో రూ.25లక్షలతో, దివిలిలో రూ.40లక్షలతో పల్లె పండుగ పనులు నిర్వహిస్తున్నట్లు ఇఇ మల్లిఖార్జునరావు తెలిపారు. ఈ పనులతో సిసి డ్రైన్లు, సిసి రోడ్లు, నాణ్యతతో నిర్మించడం జరుగుతుందని ఇఇ తెలిపారు. ఆయన వెంట డిఇ రామకృష్ణయ్య, జెఇ శ్రీనివాసరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ బందారు మణికంఠ, పలువురు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ భూములు మాయం

**– కబ్జాకు గురైన వేల ఎకరాల ప్రభుత్వ భూములు**
**– ముడుపుల మత్తులో రెవెన్యూ శాఖ అధికారులు**



**ఎటపాక, మేజర్ న్యూస్ :** పేదవాడికి సెంటు భూమి ఇవ్వాలన్నా అధికారులు సవాలక్ష ప్రశ్నలు అడిగి కాళ్లు అరిగేలా కార్యాలయాల్లో చుట్టూ తిప్పుకుంటారు. అదే బడాబాబులు వేల ఎకరాల ప్రభుత్వ భూములను కాచేసినా పట్టించుకోరు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలంలోని వేల ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అంటే రాష్ట్రం విడిపోక ముందు ఎటపాక మండలం భద్రాచలం రూరల్ ప్రాంతంగా ఉండేది. ఆ రూరల్ ప్రాంతంలో వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఉండేది. రాష్ట్రం విడిపోయిన అనంతరం భద్రాచలం ఆనుకొని వున్నా అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండల పరిధిలో గల లక్ష్మీదేవిపేట గ్రామంలో వున్న ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యాయి. ప్రభుత్వం, అసైన్డ్, సీలింగ్ భూములను ఆసరాగా చేసుకుని కొంతమంది బడాబాబులు రియల్ వ్యాపారం సాగిస్తున్నారు. వారికి రెవెన్యూ శాఖ అధికారులు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారు. పేదవాడికి ఒక సర్టిఫికెట్ కావాలంటే పలుమార్లు తహసిల్దార్ కార్యాలయం చుట్టూ తిరగవలసి వస్తుంది. అదే బడాబాబులు ఒకసారి వస్తే వారికి పని అవుతుంది. రాష్ట్రం ఏర్పడి నాటి నుంచి ఒక ఎకరా ప్రభుత్వ భూమి కూడా రెవెన్యూ అధికారుల ఆధీనంలో లేదు. ప్రభుత్వ భూమి కనిపిస్తే చాలు కబ్జాదారులకు పండగే పండగ. ప్రభుత్వ స్థలాలను ఇష్టానుసారంగా ఆక్రమించి అక్రమంగా కట్టడాలు నిర్మిస్తున్నా పట్టించుకునే నాధుడే లేడు. ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టం అమలులో ఉన్నా భూకబ్జాదారులు అక్రమంగా నిర్మాణాలను చేపడుతూ, 1/70 చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. వారికి రెవెన్యూ శాఖ అధికారులు అండగా ఉంటున్నారు. 1/70 చట్టం అమలులో వున్న ప్రాంతంలో భూములు కొనుగోలు చేయడం కానీ, అమ్మకాలు చేయడం కానీ చేయరాదు. కానీ అవన్నీ పట్టించుకోకుండా గిరిజన చట్టాలను తుంగలో తొక్కుతూ బడాబాబులు రియల్ వ్యాపారం కొనసాగిస్తున్నారు. ఇకనైనా రెవెన్యూ శాఖ అధికారులు ముడుపుల మత్తు వీడి, కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని, 1/70 చట్టాన్ని తుంగలో తొక్కుతూ కొనుగోలు, అమ్మకాలు చేస్తున్నటువంటి రియల్ వ్యాపారస్తులపై కఠినచర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## గ్రంథాలయాలను ప్రజల్లోకి తీసుకొని వెళ్ళడానికి కృషి చేసిన వ్యక్తి పాతూరి నాగభూషణం



**కొవ్వూరు,మేజర్‌న్యూస్ :** కొవ్వూరు ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయములో నిర్వహించుచున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ది.16-11-2024న గ్రంథాలయ అభివృద్ధి కారకులైన పద్మశ్రీ అయ్యంకి వెంకట రమణయ్య, గ్రంథాలయ శాస్రంలో విశేష కృషి చేసిన డా. ఎస్.ఆర్.రంగ నాథన్, మరియు గ్రంథాలయ ఉద్యమకారుడు పాతూరి నాగ భూషణంను స్మరించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల(బాలురు) లైబ్రేరియన్ జె.ఉదయ శ్రీ మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమంలో గ్రంథాలయ ఉద్య మం కీలక పాత్ర పోషించినదని మరియు గ్రంథాలయ ఉద్యమం ద్వారా దేశంలో గ్రంథా లయాలను స్థాపించుటకు కృషి చేసిన వ్యక్తి శ్రీ అయ్యంకి వెంకట రమణయ్య, గ్రంథాల య పితామహుడుగా పేరుగాం చారని, గ్రంథాలయ శాస్త్రంలో విశేష కృషి చేసి గ్రంథల య పం చసూత్రాలను రూపొందించిన వ్యక్తి డా.ఎస్.ఆర్.రంగ నాథన్, చిన్నతనం నుండి గ్రంథాలయాలను ప్రజల్లోకి తీసుకొని వెళ్ళడానికి కృషి చేసిన వ్యక్తి పాతూరి నాగభూషణం అని తెలియజేసారు.

ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యోగులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, పాఠకు లు మరియు వివిధ పాఠశాల విద్యార్థులు పాల్గోన్నారు.అనంతరం పాఠశాల విద్యార్థు లకు జూనియర్స్ మరియు సీనియర్స్ విభాగంలో "దేశభక్తి గీతాలు, లలిత గీతాలు, జానపద గీతముల" పోటీలు నిర్వ హించడం జరిగింది. ఈ పోటీలలో సుమారు 110 మంది వి ద్యార్థులు పాల్లొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రేడ్.1 లైబ్రేరియన్, ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయం, కొవ్వూరు, జి.వి. వి.ఎన్.త్రినాథ్ పాల్గొన్నారు.


# పాదగయలో ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రత్యేక పూజలు

**– కుక్కుటేశ్వర స్వామిని దర్శించుకున్న ప్రిన్సిపాల్ సెక్రటరీ వాణిమోహన్**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం పట్టణంలో ప్రసిద్ధిగాంచిన దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పాదగయాక్షేత్రంలో ఐఏఎస్ అధికారిని ప్రిన్సిపాల్ సెక్రటరీ వాణిమోహన్ ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా ప్రిన్సిపల్ సెక్రెటరీ వాణిమోహన్‌కు ఆలయ పండితులు అధికారులు ఘన స్వాగతం పలికారు ముందుగా కుక్కుటేశ్వర స్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు అనంతరం రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వయంభుగా వెలిసిన దత్తాత్రేయ స్వామి వారికి గణపతి స్వామి వారికి ప్రిన్సిపల్ సెక్రెటరీ వాణిమోహన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పదో శక్తిపీఠమైన పురుహుతికా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రెటరీ వాణిమోహన్ మాట్లాడుతూ... కార్తీక మాసం సందర్భంగా కుక్కుటేశ్వర స్వామి, రాజరాజేశ్వరి అమ్మవారిని పదోశక్తి పీఠం పురుహుతిగా అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చినట్లు తెలియజేశారు. ప్రసిద్ధిగాంచిన పురాతనమైన పాదగయ క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. దేవాదాయ శాఖ కమిషనర్ మరియు కార్యనిర్మాణ అధికారి కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ సమక్షంలో... వేద పండితులు ఆశీర్వచనం అందించారు. తీర్థప్రసాదాలను అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. పాదగయ క్షేత్రానికి కార్తీక మాసం సందర్భంగా ప్రతిరోజు వేలాదిమంది భక్తులు తరలివస్తున్నారుని, ఆలయానికి వచ్చే భక్తుల అవసరార్థం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి స్థానిక ఎమ్మెల్యే పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు పవన్ కళ్యాణ్ ట్రస్ట్ మంగళగిరి వారు సహకారంతో 20 మరుగుదొడ్లు ఏర్పాటు చేయడం జరిగిందని, మరుగుదొడ్లు ఈరోజు నుంచి అందుబాటులో తీసుకొచ్చినట్లు తెలియజేశారు. భక్తుల కోసం ఉపముఖ్యమంత్రి సహకారంతో మరుగుదొడ్లు ఏర్పాటు చేయడంతో భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.

## ఉద్యమంతో సమస్య పరిష్కారం



**ధవళేశ్వరం, మేజర్ న్యూస్ :** 3 నెలల క్రితం పాడైన 50హెచ్‌పి పంపు బాగు చేయించడంలో పంచాయతీ అధికార్ల నిర్లక్ష్యం కారణంగా మంచినీటి సరఫరా సక్రమంగా జరగక ప్రజలు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా ఉద్యమించన ఫలితంగా ఉన్నతాధికార్లు స్పందించి యుద్ధప్రాతి పదికన పంపును మరమ్మత్తు చేయించారు.క్లీనింగ్ పని జరుగుతున్నందున రేపటి నుండి మంచినీటి సరఫరా పునరుద్ధరణ జరిగి ప్రజలకు నీటి కష్టాలు తీరనున్నాయి. గ్రామ ప్రత్యేక అధికారి ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈకి, ఆర్‌డబ్ల్యుఎస్ అధికార్లకు మరియు శ్రమించిన పంచాయతీ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

## మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ ఆదేశాలు ఇవ్వాలని అంగన్వాడీల ధర్నా

**– 42 రోజుల సమ్మె ఒప్పందాన్ని అమలు చేయాలని డిమాండ్**





**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు అనుబంధం ఆధ్వర్యంలో రాష్ట్ర పిలుపుమేరకు అంగన్వాడీ మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చుతూ ఆదేశాలకు తక్షణమే విడుదల చేయాలని, 42 రోజుల సమ్మె ఒప్పందాన్ని అమలు చేయాలని, మినీ వర్కర్లకు మెయిన్ వర్కర్లతో సమానంగా వేతనాలు, ప్రమోషన్లు, వేసవి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కాకినాడ కలెక్టరేట్ వద్ద అంగన్వాడీలు ధర్నా నిర్వహించి జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ గారికి వినతిపత్రం అందించారు. ఈ ధర్నాను ఉద్దేశిస్తూ సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వ శేషబాబ్జి, ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్సులు దడాల పద్మ, ఏరుబండి చంద్రావతి మాట్లాడుతూ 42 రోజుల రాష్ట్రవ్యాప్త సమ్మె ముగిసి నేటికీ ఎనిమిది నెలలు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం రాసి ఇచ్చిన ఒప్పందం మేరకు ఏ ఒక్క డిమాండ్ ను కూడా నెరవేర్చలేదని విమర్శించారు. అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేయడానికి, రాష్ట్ర అప్పులను కారణంగా చూపడం మానుకోవాలన్నారు. 300 కుటుంబాలకు మినీ సెంటర్ ఉండాల్సి ఉండగా 1500 కుటుంబాలలో కూడా మినీ సెంటర్లను నిర్వహిస్తూ మినీ వర్కర్లను బానిసలుకంటే దారుణంగా పని చేయిస్తున్నారన్నారు. సుప్రీంకోర్టు తీర్పును సైతం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 42 రోజుల సమ్మె ఒప్పందం అమలుకు దశాలవారి పోరాటాలకు అంగన్వాడీలు సిద్ధపడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమానికి ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ల పద్మ , మధ్యాహ్న భోజన పథక కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్ల ఈశ్వరి, రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్, జిల్లా కోశాధికారి మాలకా రమణ, పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ మెడిశెట్టి వెంకట రమణ, కాకినాడ రూరల్ కన్వీనర్ టి. రాజా తదితరులు మాట్లాడి మద్దతు తెలియజేసారు.ధర్నాలో కోశాధికారి రమణమ్మ, జ్యోతి, ధనలక్ష్మి, చామంతి, లక్ష్మీ, మేరీ సమాధానం, ఎస్తేరు రాణి, రాజేశ్వరి, భాంధవి, నాగమణి, తులసి, వీరమణి, వసుధ, జయ, నాగ సూర్యకళ తదితర అంగన్వాడీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## శృంగార వల్లభ స్వామి వారిని దర్శించుకున్న భక్తులు

**– వేదపండితుల ఆధ్వర్యంలో స్వామివార్కి ప్రత్యేక అలంకరణ**



**పెద్దాపురం,మేజర్‌న్యూస్ :** పెద్దాపురం మండలం, తిరుపతి గ్రామంలో వేంచేసియున్న శ్రీశ్రీ శృంగారవల్లభస్వామిని శనివారం వేలాదిసంఖ్యలో భక్తులుదర్శించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కార్యనిర్వాణాధికారి వడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రత్యేకదర్శనం టికెట్ల ద్వారా రూ.2,38,620/-, అన్నదాన విరాళాల ద్వారా రూ.85,895/-లు, కేశఖండన ద్వారా రూ.5,520/-, తులాభారం ద్వారా రూ.500/- లడ్డూ ప్రసాదాల ద్వారారూ.28,665/- మొత్తం రూ.3,59,240/-లు స్వామి వారికి ఆదాయం రావడం జరిగిందని తెలిపారు. వేదపండితులు స్వామివారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించడం జరిగింది. అలాగే దేవస్థానం తరపున ఉదయం పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. అనంతరం భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని, స్వామి వారి ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు పెద్దింటి నారాయణాచార్యులు, పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి గోపాలాచార్యులు, ఆలయ సిబ్బంది కృష్ణ, మోహనరావు, సత్యనారాయణ, ఇతర స్వచ్ఛంద సేవకులు, వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సూర్య
తూర్పుగోదావరి
ఆదివారం,
17 నవంబర్ 2024



## నూతన ఆర్డీఓను మర్యాదపూర్వకంగా కలిసిన మోడరన్ అధినేత జి.వి.రావు



రామచంద్రపురం,మేజర్‌న్యూస్ : రామచంద్రపురం నూతన ఆర్డీఓ దేవరకొండ అఖిలను మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జి.వి.రావు శనివారం మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా రావు ఆర్డీఓ కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరంరావు మాట్లాడుతూ మహిళా సాధికారతను చాటుతూ, ఉన్నత పదవి సాధించి నేటి యువతులకు ఆర్డీఓ అఖిల స్ఫూర్తిగా నిలుస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా జి.వి.రావు,ఆర్డీఓకు తమ విద్యాసంస్థలలో అధిక సంఖ్యలో గ్రామీణ ప్రాంతాల బాలికలే విద్యాభ్యాసం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో బాలిక విద్యావ్యాప్తికి జి.వి.రావు కృషి చేయడం హర్షణీయం అని పేర్కొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్‌గా మహమ్మద్ ఫాసి ఉల్లాహ్ బేగ్



కొవ్వూరు, మేజర్ న్యూస్ : కొవ్వూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్‌గా మండలంలోని కాపవరం గ్రామానికి చెందిన మహమ్మద్ ఫాసి ఉల్లాహ్ బేగ్‌ను నియమించినట్లు తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు టి.కే. విశ్వేశ్వర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఫాసి ఉల్లాహ్ బేగ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయబోనని నియోజకవర్గంలో నాయకులను కలుపుకొని కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తానని అన్నారు. తనకు ఈ బాధ్యతను అప్పజెప్పిన రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు షర్మిలా రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని నూతన ఆవిష్కరణలు చేపట్టాలి







- ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ.వి.రవీంద్రనాధ్
- ముగిసిన రోబోటిక్స్‌పై ఉచిత శిక్షణా కార్యక్రమం

**కాకినాడ, మేజర్‌న్యూస్ :** జెఎన్‌టియుకె ప్రాంగణంలో ఇండస్ట్రీ ఇనిస్టిట్యూట్ ఇంటరాక్షన్ ప్లేస్‌మెంట్ & ట్రైనింగ్ (ఐఐఐపి&టి) డైరెక్టరేట్ మరియు కోయంబత్తూర్‌లోని జీకర్స్ ఎంప్లాయిమెంట్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో “రోబోటిక్ అప్లికేషన్‌ల కోసం కస్టమ్ ఎంబెడెడ్ బోర్డ్‌ను అభివృద్ధి చేయడం” అనే అంశంపై యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ (యుసిఇకె) ప్రిన్సిపాల్ ఆఫీస్ సెమినార్ హాలు నందు మూడు రోజుల పాటు విద్యార్థులకు నిర్వహించిన ఉచిత శిక్షణా కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఐఐఐపి & టి డైరెక్టర్ ప్రొ. బి.టి.కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ. వి.రవీంద్రనాధ్ ముఖ్యఅతిథిగా విచ్చేయగా రిసోర్స్‌పర్సన్స్ జీకర్స్ ఎంప్లాయిమెంట్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు డా.ఎం.ఎ. రాజా, ఆర్.భువనేశ్వరిలు విచ్చేశారు. ఈసిఈ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.కె.దుర్గా గంగారావు కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ.వి.రవీంద్రనాధ్ మాట్లాడుతూ జెఎన్‌టియుకె మరియు అనుబంధ కళాశాలల విద్యార్థులకు ఇటువంటి ఉచిత శిక్షణా కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రోబోటిక్స్, ఐఓటి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తదితర సాంకేతిక కోర్సులలో విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు అధిక ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. విద్యార్థులు ఈ శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగ పర్చుకుని రోబోటిక్స్‌లో నేర్చుకున్న సాంకేతిక అంశాలు, కోడింగ్ మరియు నూతన ఆలోచనలతో మరిన్ని ఆవిష్కరణలు చేపట్టాలన్నారు. జెఎన్‌టియుకె ఆధ్వర్యంలో ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇటువంటి శిక్షణా కార్యక్రమం ద్వారా విద్యార్థులు రోబోటిక్స్ సాంకేతికతను నేర్చుకోవడం అభినందనీయమన్నారు. రోబోటిక్ అప్లికేషన్‌లపై శిక్షణా కార్యక్రమం నిర్వహించడానికి సహకరించిన జీకర్స్ ఎంప్లాయిమెంట్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు డా.ఎం.ఎ. రాజా, ఆర్.భువనేశ్వరిలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

అనంతరం ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ.వి.రవీంద్రనాధ్ విద్యార్థులు అభివృద్ధి చేసిన రోబోటిక్స్ నమూనాల వివరాలను అడిగి వాటి పనితీరును ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. అదేవిధంగా రోబోటిక్స్ శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు తాము నేర్చుకున్న అంశాలను, రూపొందించిన నమూనాల వివరాలను, అభిప్రాయాలను వెల్లడించారు. శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు ముఖ్యఅతిథి ప్రొ.వి.రవీంద్రనాధ్ చేతుల మీదుగా సర్టిఫికెట్‌లను అందజేశారు. ఈ ఉచిత శిక్షణా కార్యక్రమంలో యుసిఇకె అధ్యాపకులు, యుసిఇకె, ఐడియల్ ఇంజనీరింగ్ కాలేజీ, ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీ, ప్రైడా ఇంజనీరింగ్ కాలేజీల విద్యార్థులు తదితరులు హాజరయ్యారు.

## ర్యాష్ డ్రైవింగ్, అల్లర్లపై ప్రత్యేక డ్రైవ్

- ఎస్సై మౌనిక



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా, ఎస్.పి.విక్రాంత్ పాటిల్, పెద్దాపురం డిఎస్‌పి డి.శ్రీహరిరాజు ఆదేశాల మేరకు పెద్దాపురం పట్టణం, మండలంలో గల ఇంజనీరింగ్ కాలేజిలు, హైస్కూల్స్ వద్ద ఎస్సై వి.మౌనిక ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. దీనిలో భాగంగా పెద్దాపురం మండలం, దివిలిలో స్కూల్ వద్ద, ఇంజనీరింగ్ కాలేజి వద్ద విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ఆకతాయిల ఆట కట్టించేందుకు ఎస్సై మౌనిక శనివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ట్రిబుల్ రైడ్, ర్యాష్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ నిర్లక్ష్యంగా వ్యవహరించే వ్యక్తుల పట్ల పోలీస్ సిబ్బంది అవగాహన కల్పించారు. అలాగే పాఠశాలలు, కళాశాలల సమయాలలో ఎలాంటి అల్లర్లకు పాల్పడినా సహించేది లేదని ఎస్సై మౌనిక హెచ్చరించారు. ఇదే రీతిలో వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు మహిళలపట్ల దురుసుగా ప్రవర్తించిన, మహిళలను దుర్భాషలాడిన కఠిన చర్యలు తప్పవని ఎస్సై మౌనిక హెచ్చరించారు.

## ఎక్సైజ్ దాడులలో 2400 లీ.బెల్లపు ఊట ధ్వంసం

- పదిమంది ముద్దాయిలు బైండోవర్



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం ఎక్సైజ్ సిఐ కె.వి.వి.డి.అర్జునరావు ఆదేశాల మేరకు పెద్దాపురం సర్కిల్ పరిధిలోని పెద్దాపురం మండలం, తిరుపతి గ్రామంలో దాడులు నిర్వహించి, 2400 లీ.బెల్లపు ఊట ధ్వంసం చేసి, ఒక కేసు నమోదు చేయడం జరిగిందని, ఈ దాడులలో ఎసి ఇఎన్‌ఎఫ్ సిబ్బంది, ఎక్సైజ్ ఎస్సై, సిబ్బంది పాల్గొన్నారని ఎక్సైజ్ సిఐ కె.వి.వి.డి.అర్జునరావు తెలిపారు. అలాగే పెద్దాపురం మండలంలోని సారా కేసులలో గల 10మంది పాత ముద్దాయిలను పెద్దాపురం తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మీ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సిఐ అర్జునరావు తెలిపారు.


## ప్రైవేట్ ట్రావెల్స్ బస్ ఢీకొని వ్యక్తి మృతి



**పెరవలి, మేజర్ న్యూస్ :** నల్లకులవారిపాలెం గ్రామంలో 16వ నెంబర్ జాతీయ రహదారి సెంటర్లో నవంబర్ 16 వ తేది శనివారం ఉదయం 6.00 గం సమయం లో ప్రైవేట్ ట్రావెల్స్ బస్ డికొని ఒక వ్యక్తి మృతి చెందినట్లు పెరవలి ఎస్సై ఎం వెంకటేశ్వరావు తెలియజేశారు. పెరవలి మండలం నల్లకులవారిపాలెం గ్రామానికి చెందిన నల్లాకుల వెంకట నరసయ్య, తండ్రి: బుల్లియ్య, 48 సం. అను అతను తన ఇంటి వద్ద నుండి నల్లకులవారిపాలెం సెంటర్‌కి టీ త్రాగుటకు నడుచుకుంటూ వెళుతూ జాతీయ రహదారి దాటు చుండగా తణుకు వైపు నుండి రావులపాలెం వైపు వెళ్ళు చున్న మైత్రి ట్రావెల్ బస్సు సదరు నల్లాకుల వెంకట నరసయ్య ను గుద్దగా అతనికి తలకు బలమైన రక్త గాయాలు అయి అక్కడికక్కడే చనిపోయినట్లు ఎస్ఐ ఎం వెంకటేశ్వరరావు తెలియజేశారు. దీనిపై మృతుని భార్య అయిన కనక దుర్గ ఫిర్యాదు పై పెరవలి ఎస్ఐ ఎం వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గ్రంథాలయ ఉద్యమ పితామహులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలి

- రిటైర్డ్ లైబ్రేరియన్ ఎస్‌వివి సూర్యనారాయణ



**పెరవలి,మేజర్‌న్యూస్ :** గ్రంథాలయాల అభివృద్ధికి సర్వస్వం ధారపోసిన గ్రంథాలయ ఉద్యమ పితామహులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని ముక్కామల శాఖ గ్రంథాలయం విశ్రాంత లైబ్రేరియన్ సలాది వీరవెంకట సూర్యనారాయణ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలు జరుగుతున్న సందర్భంగా ముక్కామల శాఖ గ్రంథాలయంలో నవంబర్ 16వ తేదీ శనివారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేసిన ప్రముఖులు అయ్యంకి వెంకటరమణయ్య , పాతూరు నాగభూషణం, గాడిచర్ల హరిసర్వోత్తమ రావు, ఎస్సార్ రంగనాథన్, ల చిత్రపటాలకు నివాళులర్పించి స్మరించుకుంటూ గ్రంధాలయాలకు వారుచేసిన కృషిని రిటైర్డ్ లైబ్రేరియన్ సలాది వీర వెంకట సూర్యనారాయణ సభికులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముక్కామల గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీమతి అంబటి దుర్గా నాగలక్ష్మి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కడియాల సాయి రామారావు, సభ్యులు కొంపెల్ల పట్టాభి రామారావు, మద్దిపాటి సత్యనారాయణ, కరటూరి కామేశ్వరరావు, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమం గ్రంథాలయ అధికారి ఎం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.

## సైబర్ నేరాల కట్టడికి అధికారులు సహకరించాలి - సిఐ సుమంత్



అనపర్తి ,మేజర్ న్యూస్ ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు అధికమవుతున్నాయని, ముఖ్యంగా బ్యాంకు ఖాతాలో ఉన్న సొమ్మును సైబర్ నేరగాళ్లు దోపిడీ చేస్తున్నారని సైబర్ నేరాలు అరికట్టేందుకు బ్యాంకు అధికారులు సహకరించాలని అనపర్తి సిఐ సుమంత్ అన్నారు. శనివారం అనపర్తి సర్కిల్ పరిధిలోని మూడు మండలాల్లో ఉన్న బ్యాంకు అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. అక్రమంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో కంప్యూటర్ పై అవగాహన కలిగివున్న కొంతమంది వ్యక్తులు నెట్వర్క్ ద్వారా బ్యాంకు ఖాతాను హ్యాక్ చేసి సొమ్ములు కాజేస్తున్నారని, సైబర్ నేరాలపై కేసులు పెరుగుతున్నాయని సైబర్ నేరాలను అరికట్టేందుకు అందరూ సహకరించాలని అన్నారు. అసలు బ్యాంకు ఖాతాలో సొమ్ములు పోవడానికి గల కారణాలను బ్యాంక్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. బ్యాంక్ అధికారులు మాత్రం వ్యక్తి ప్రమేయం లేకుండా తమ ఖాతాలోని సొమ్ములను దోపిడీ చేయడం సాధ్యం కాదని, కానీ ఈ మధ్యకాలంలో ఎక్కడైనా ఈకేవైసీ చేసిన కొంతమంది ఖాతాల్లో డబ్బులు పోవడంపై ఆందోళన చంద్రం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీను నాయక్ మాట్లాడుతూ అకౌంట్ ఓపెన్ చేసేందుకు ఏ ఏ పత్రాలు తీసుకుంటారని, అకౌంట్ తెరిచిన తర్వాత ఎన్ని రోజులు ఆ ఖాతా తెరిచి ఉంటుందని సైబర్ నేరగాలకు బ్యాంకులో ఖాతా ఉండటం వల్ల సైబర్ నేరాలు పాల్పడేందుకు అవకాశం ఉంటుందా అన్న సందేహాలను బ్యాంక్ అధికారులు అడిగి తెలుసుకున్నారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు తమ వంతు సహకారం అందిస్తామని బ్యాంక్ అధికారులు తెలిపారు. సైబర్ నేరాలపై ప్రజల కూడా అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులు సూచించారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన పొలమూరు విద్యార్థులు



**అనపర్తి, మేజర్ న్యూస్ :** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తూర్పుగోదావరి జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్ 17 విభాగంలో పవర్ లిఫ్టింగ్ పోటీలలో అనపర్తి మండలం పొలమూరు గ్రామంలోని శ్రీ సత్తి వీర రాఘవరెడ్డి లక్ష్మీనరసయమ్మ జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల పిడి సూర్య ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఆ విద్యార్థుల్లో వానపల్లి వెంకట శ్రీరామ్ (53 కేజీలు విభాగంలో) మేడపాటి సంకీర్తన దేవి (69 కేజీలు విభాగంలో ) కర్రి ధనుష్ రెడ్డి(83 కేజీలు విభాగంలో) గుడాల వెంకట లోకేష్ స్టాండ్ బై గాను అర్హత సాధించారని, మరియు అండర్ 14 టేబుల్ టెన్నిస్ విభాగంలోపెంకే వీర వెంకట సత్యనారాయణ ఎంపికై రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనుటకు అర్హత సాధించాలని అన్నారు. పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ వి నాగేశ్వరావు మాట్లాడుతూ మన పాఠశాల విద్యార్థులు విద్యలోనే కాకుండా క్రీడల్లో కూడా రాణించడం, రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత పొందడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను, వారికి క్రీడల్లో నైపుణ్యం కలిగించి వారి విజయానికి కారుకులైన పాఠశాల పిడి సూర్య ప్రభాకర్ రెడ్డికి అభినందనలు తెలియజేశారు. పాఠశాల పీడీని,విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యయు రాలు ఆర్. విజయదుర్గ, సీనియర్ ఉపాధ్యాయులు, పి సురేష్ కోణాల సత్తిరెడ్డి మరియు ఉపాధ్యాయులు, టిడిపి పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ద్వారంపూడి ఈశ్వర్ రెడ్డి, సత్తి దేవానంద రెడ్డి (బాబా ) సత్తి సత్యనారాయణ రెడ్డి, కొవ్వూరి వెంకటరెడ్డి,( స్టీలు కొట్టు రెడ్డి )గేమ్స్ ప్రోత్సాహక దాత ద్వారంపూడి నారాయణ రెడ్డి మరియు గ్రామ ప్రజలు అభినందించారు.

## ఇసుకర్యాంపును పరిశీలించిన ఆర్డీవో

- గృహ నిర్మాణధారులు స్థానిక సచివాలయంలో రసీదు పొందాలి





**కొత్తపేట, మేజర్ న్యూస్ :** ర్యాంపు నుండి ఇసుక కావలసిన వారు స్థానిక గ్రామ సచివాలయంలో గృహ నిర్మాణదారులు తమ ఆధార్ కార్డుతో వెళ్లి ఆన్లైన్ లో సాండ్ పోర్టల్ నందు జారీ చేయుచున్న రశీదు పొందిన తరువాత మాత్రమే ఇసుక తీసుకువెళ్లాలని కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ తెలియజేసారు. ఉచిత ఇసుక సరఫరా కొరకు ఏర్పాటు చేసిన మండల పరిధిలోని మందపల్లి ఇసుక ర్యాంపును ఆర్డీవో తనిఖీ చేశారు. ఈ ర్యాంపు నిర్వహణపై పనిచేస్తున్న జట్టు కూలీలకు మరియు ర్యాంపు నిర్వహిస్తున్న సిబ్బందికి తగు సూచనలు జారీచేశారు. ఇసుక స్థానిక అవసరాల కొరకు వినియోగించుటకు నిర్ణయించినందున సంబంధిత సాండ్ పోర్టల్ నందు జారీ చేయుచున్న రశీదు పై జనరల్ కన్స్యూమర్ అని కాకుండా లోకల్ కన్స్యూమర్ ఆప్షన్ ద్వారా మాత్రమే జారీ చేయవలసినదిగా డిజిటల్ అసిస్టెంట్లకు,పంచాయితీ కార్యదర్శులకు సూచించారు. ఇసుక కావలసిన వారు లోకల్ కన్స్యూమర్ ఆప్షన్ ద్వారా మాత్రమే గ్రామ సచివాలయంలో రశీదు పొందాలని సూచించారు. ఈ మార్గదర్శకాలను పాటిస్తూ ఇసుక సరఫరాను వినియోగించుకోవలెనని గ్రామ ప్రజలకు తెలియజేసారు. ర్యాంపు నందు స్థానిక పోలీసు, రెవెన్యూ సిబ్బంది,ఇరిగేషన్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ తనిఖీ లలో కొత్తపేట తహశీల్ధార్,పోలీసు శాఖ,ఇరిగేషన్ శాఖ,మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గోవింద నామస్మనులతో ప్రతిధ్వనించిన వాడపల్లి

- కార్తీక మాసం భక్తజన సందోహంగా వాడపల్లి







**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కార్తీక మాసం మూడవ శనివారం కావడంతో కోనసీమ తిరుమలగా కోరిన కోర్కెలు తీర్చే దైవంగా విరాజిల్లుతున్న వాడపల్లి వెంకటేశ్వరస్వామివారి ఆలయం భక్తుల గోవింద నామ స్మరణతో ప్రతిధ్వనించింది. ఏడు శనివారాల వెంకన్న దర్శనం ఏడేడు జన్మల పుణ్యఫలం అనే నానుడితో రాష్ట్రాలనుండి వేలాదిమందిభక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించి మొక్కుబడులు తీర్చుకుంటున్నారు. స్వామివారికి సుప్రభాత సేవ, నీరాజనం మంత్రపుష్పం, పుణ్యా వచనం, కళ్యాణం తదితర కార్యక్రమాలను అర్చక బృందం వైభవంగా నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపింది. వచ్చిన భక్తులకు ప్రసాద వితరణ అనంతరం అన్నదానం నిర్వహించారు. ఆలయంలో నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. శనివారం స్వామివారి ఆదాయం రూ.40 లక్షలు సమకూరింది. అరకు శాసనసభ్యులు రేగం మత్యలింగం స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇబ్బందులు తలెత్తకుండా డిప్యూటీ కమిషనర్ నల్లం చక్రధర్ రావు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## పేదవాడికి ఉచిత ఇసుక అందేలా అధికారులు సహకరించాలి

- మాజీ ఎమ్మెల్యే శేషారావు



**పెరవలి, మేజర్ న్యూస్ :** నిడదవోలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నవంబర్ 16వ తేదీ శనివారం నిడదవోలు మాజీ శాసనసభ్యులు తెదేపా ఇంచార్జ్ బూరుగుపల్లి శేషారావు నేతృత్వంలో ఉచిత ఇసుక విధానంపై కూటమి నాయకుల అవగాహన సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానంపై ప్రతి పేదవాడికి ఉచిత ఇసుక అందే విధంగా అధికారులుసహకరించాలని అధిక ధరలకు ఇసుక విక్రయిస్తే ఊరుకోనని అలాకాని పక్షంలో మేమే దగ్గరుండి ప్రతిపేదవానికి ఉచిత ఇసుక అందిస్తామని అన్నారు. ఈ సమావేశానికి విచ్చేసిన తెదేపా, జనసేన, బిజెపి పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తల అభిప్రాయాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారాచంద్రబాబునాయుడు సోదరులు మాజీశాసనసభ్యులు, పారిశ్రామికవేత్త నారా రామ్మూర్తి నాయుడు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

## కలక్టరేట్ శాశ్వతభవనాల స్థల పరిశీలన

- కలక్టర్ పి.ప్రశాంతి



**రాజానగరం, మేజర్‌న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని శాశ్వత కలక్టరేట్, ఇతర ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు నేపధ్యంలో ఆయా భవనాల నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని పరిశీలించడం జరిగిందని జిల్లా కలెక్టర్ పిప్రశాంతి తెలియచేశారు. శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి స్థానిక జాంపేట పోలీస్ క్వార్టర్స్ సమీపంలో వున్న స్థలాన్ని అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ భవనాలు నిర్మాణం కోసం అనువైన ప్రదేశం గుర్తించడం లో భాగంగా పోలీసు క్వార్టర్స్ సముదాయానికి అనుకుని, స్వామీ థియేటర్ ఎదురుగా ఉన్న సుమారు 7 ఎకరాలకు పైగా ఉన్న స్థలాన్ని పరిశీలించడం జరిగిందన్నారు. కలక్టరేట్ తో పాటు గా ఇప్పటికే వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు, ఎన్ఐసి, వైటీసీ తదితర భవన సముదాయాలు ప్రభుత్వ కార్యాలయాలని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలకి అందుబాటులో ఉండేలా నగరంలోనే కలక్టరేట్‌తో పాటు ఇతర ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించను న్నట్లు తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్ డిఓ ఆర్. కృష్ణ నాయక్, ఆర్ అండ్ బి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మూతపడ్డ కర్మాగారం

- ఆందోళనలో కార్మికులు



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** మండలంలోని చిన్నింపేట జీడి పిక్కల ఫ్యాక్టరీ శుక్రవారంరాత్రి అకస్మాత్తుగా లే ఆఫ్ ప్రకటించి తాళాలు వేసి యాజమాన్యం పరారయ్యారు. ఈ నేపథ్యంలో కర్మాగారంలో పనిచేస్తున్న 200 మంది మహిళ కార్మికులు, వందమంది వరకు పురుష కార్మికులు రోడ్డున పడ్డారు. కర్మాగారం వద్ద కార్మికులు బైఠాయించి నిరసనలు తెలిపారు. ఈ విషయమై బోర్డు మెంబర్ రమేష్ కు పలువురు కార్మికులు ఫోన్ చేయగా ఈనెల 23 వ తేదీన వచ్చి అప్పటివరకు రావలసిన వేతనాలు చెల్లిస్తామని, ఇతర బకాయిలను చెల్లిస్తామని తెలిపినట్టు పేర్కొన్నారు. రాత్రికి రాత్రి కర్మాగారం మూసివేస్తే మా కుటుంబాలు ఎలా పోషించుకోవాలని కార్మికులు ఆందోళన చెందుతున్నారు. కార్మికులు తాము పని చేసిన కాలంలో సంవత్సరానికి రెండు లక్షల రూపాయలు నష్టపరిహారాన్ని యాజమాన్యం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. యాజమాన్యానికి తొత్తుగా వ్యవహరించే కొంతమందినే కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్మికులు ఐక్యంగా పోరాడకపోతే 300 కుటుంబాలు పైగా నష్టపోతారని వారిలో వారు చర్చించుకుంటున్నారు. కార్మిక శాఖ అధికారులు వెంటనే స్పందించి ఈ విషయమై కార్మికులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.